క్లుప్తంగా

కనీస వేతనం రూ. 257 అందేలా చూడండి



ఉపాధి పనులను పరిశీలిస్తున్న పీడీ ఉమాపరమేశ్వరి

గంట్యాడ: ఉపాధి వేతనదారులకు రోజుకు కనీస వేతనం రూ.257 వచ్చే విధంగా కొలతలు ఇచ్చి పనులు చేయించాలని డ్వామా పీడీ జి.ఉమాపరమేశ్వరి ఉపాధి సిబ్బందికి సూచించారు. మండలంలోని నరవ గ్రామంలో ఉపాధి పనులను గురువారం ఆమె పరిశీలించారు. పని ప్రదేశంలో టెంట్లు, ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందుబాటులో ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. వర్షం నీరు అంతా చెరువుల్లో నిల్వ ఉండే విధంగా, చెరువును లోతు చేయడంతో పాటు గట్టు ఎత్తు పెంచేవిధంగా పనులు చేయించాలని చెప్పారు. ఆమె వెంట ఏపీఓ ఆదిలక్ష్మి తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గజపతినగరం: మండల కేంద్రంలో విద్యుత్ మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో శుక్రవారం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్‌శాఖ డీఈ శివకుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. గజపతినగరంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కృష్ణారావు ఆస్పత్రి, బాలాజీనగర్ రోడ్డు తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

అప్రమత్తంగా ఉండండి

బొండపల్లి: ఆవులపై పులి దాడి చేస్తున్న నేపథ్యంలో మండలంలోని గొల్లుపాలెం గ్రామానికి ఆనుకుని ఉన్న సమీప గిరిజన గ్రామాల్లోని ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని గ్రామాల్లో దండోరా వేయించామని తహశీల్దార్ శ్రీనివాస్ మిశ్రా గురువారం తెలిపారు. ఆరు బయట ఆవులను కట్టవద్దని, అత్యవసరం అయితే తప్ప ప్రజలు రాత్రి పూట బయటకు రావద్దని సూచించినట్లు పేర్కొన్నారు.

మునగ మొక్కల పంపిణీ



మహిళలకు మునగ మొక్కలు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ తవుడు

గజపతినగరం రూరల్: మండలంలోని ముచ్చర్ల గ్రామంలో వెలుగుశాఖ ఆధ్వర్యంలో డ్వాక్రా సంఘాల మహిళలకు జెడ్పీటీసీ గార తవుడు గురువారం మునగ మొక్కలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఇంటి పెరటిలో, ఖాళీ ప్రదేశాల్లో మునగ మొక్కలు పెంచాలని మహిళలకు సూచించారు. మునగ ఆకులతో చేసిన కూరను తినడం వల్ల మహిళల్లో రక్తహీనతతో పాటు, పలు రోగాలను నివారించవచ్చని అన్నారు. అలాగే మునగ మొక్కల పెంపకంతో మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్ఐసీ ఉద్యోగుల నిరసన



నిరసన తెలుపుతున్న ఎల్ఐసీ ఉద్యోగులు

చీపురుపల్లిరూరల్(గరివిడి): ఎల్ఐసీ ఉనికికే ముప్పు కలిగేలా కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలను వ్యతిరేకిస్తున్నామని లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ గరివిడి బ్రాంచ్ యూనిట్ అధ్యక్ష,కార్యదర్శులు డి.జె.ప్రసాద్,జి. సిద్ధార్థ అన్నారు. గరివిడి ఎల్ఐసీ కార్యాలయం వద్ద గురువారం మధ్యాహ్న భోజన సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి ఎల్ఐసీ ఉద్యోగులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎల్ఐసీలోనే కాకుండా బాగా లాభాలు ఆర్జిస్తున్న ప్రభుత్వరంగ సంస్థల్లో వాటాల ఉప సంహరణ, ప్రైవేటీకరణ మొదటి అడుగులా ఉందన్నారు. కేంద్రం అనుసరిస్తున్న విధానం ఎల్ఐసీ మౌలిక లక్ష్యాలకు విఘాతం కలిగించేలా,పాలసీదారుల ప్రయోజనాలను దెబ్బతీసేలా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎల్ఐసీలో ఐపీఓను వ్యతిరేకిస్తున్నామన్నారు.

బాబా ఆలయంలో ప్రత్యేక పూజలు



షిర్డీ సాయిని దర్శించుకుంటున్న భక్తులు

గజపతినగరం: మండలంలో ఎం.వెంకటాపురం గ్రామంలోని షిర్డీ సాయిబాబా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులతో అర్చకులు బాబి పూజలు, అభిషేకాలు చేయించారు.

రహదారి భద్రతా నియమాలపై...

అవగాహన అవసరం



చీపురుపల్లి: అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ సన్యాసినాయుడు



జామి: ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ



గంట్యాడ: మాట్లాడుతున్న ఎస్ఐ కిరణ్‌కుమార్ నాయుడు

చీపురుపల్లి: వాహన చోదకులు అంతా రహదారి భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలని, భద్రతా ప్రమాణాలు పాటించడం వల్ల చాలా వరకు రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని ఎస్ఐ ఏ.సన్యాసినాయుడు అన్నారు. రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని ఓ ప్రైవేటు కళాశాలలో విద్యార్థులకు రోడ్డు భద్రతా ప్రమాణాలు, పాటించాల్సిన జాగ్రత్త లు, ట్రాఫిక్ నిబంధనలు, చట్టాలపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచుకోవాలన్నారు. 18 ఏళ్లు నిండిన వారు మాత్రమే డ్రైవింగ్ లైసెన్స్ పొందిన తర్వాత వాహనాలు నడపాలన్నారు. మైనర్లు వాహనాలు నడుపుతుండడం ద్వారా అధిక సంఖ్యలో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. ద్విచక్ర వాహన చోదకులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని, ఇద్దరి కంటే ఎక్కువ మంది ప్రయాణించరాదని అన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేయడంతో పాటు అపరాధ రుసుం విధిస్తామని హెచ్చరించారు.

నిబంధనలు పాటించాలి

జామి: వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలతో పాటు జాగ్రత్తలు పాటించాలని ఎస్ఐ వీరబాబు అన్నారు. రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా స్థానిక పోలీస్ స్టేషన్‌లో రహదారి భద్రతపై ఆటో డ్రైవర్లకు గురువారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికుల భద్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించవద్దని సూచించారు. మద్యంతాగి ఆటో నడిపితే కేసులు నమోదు చేస్తామని, లైసెన్స్ ఉన్నవారే వాహనం నడపాలని, మైనర్లకు వాహనాలు ఇస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.వాహనం నడిపేటప్పుడు సెల్‌పోన్ వినియోగించవద్దని చెప్పారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలి

గంట్యాడ: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎస్ఐ కె.కిరణ్‌కుమార్‌నాయుడు అన్నారు. రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా మండలంలోని కొఠారుబిల్లి జంక్షన్ వద్ద ఉన్న శ్రీనిధి కళాశాలలో విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతివేగంగా, సెల్ ఫోన్‌లో మాట్లాడుతూ, నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు సంభవిస్తున్నాయని చెప్పారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపరాదన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ హైమావతి

గంట్యాడ: గ్రామస్థాయిలో వైఎస్సార్‌సీపీ మరింత బలోపేతానికి గృహ సారథులు కృషి చేయాలని ఎంపీపీ పీరుబండి హైమావతి అన్నారు. తన స్వగ్రామం రామవరంలో నియమితులైన గృహసారథులతో పాటు గ్రామవలంటీర్లతో తన నివాసంలో గురువారం సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందుతున్నదీ లేనిది గృహసారథులు తెలుసుకోవాలన్నారు. పార్టీ కార్యక్రమాల్లో గృహసారథులు భాగస్వామ్యులై పార్టీ బలోపేతానికి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అన్నీ ప్రజలకు అందించాల్సిన బాధ్యత వలంటీర్లదేనని చెప్పారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్, సర్పంచ్ పీరుబండి పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

91 మందికి వైద్య సేవలు



చిన్నారులను తనిఖీ చేస్తున్న డాక్టర్ వేలాంగిణి

గజపతినగరం: మండలంలోని ఎం. వెంకటాపురం సచివాలయ పరిధిలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా 104 డాక్టర్ వేలాంగిణి గురువారం 91 మందిని పరీక్షించి, మందులు అందజేశారు. అనంతరం స్థానిక అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి, చిన్నారులకు ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించారు.

వీడని విద్యుత్ కష్టాలు

గుర్ల: మండలంలోని బడారిపేట వాసులకు విద్యుత్ కష్టాలు వీడడం లేదు. ఎప్పటికప్పుడు విద్యుత్ సరఫరా నిలిచిపోతుండడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు సొంత నిధులు ఇస్తానని సర్పంచ్ తిరుమరెడ్డి సూరిబాబు హామీ ఇచ్చినా, విద్యుత్ శాఖాధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖాధికారులు స్పందించి విద్యుత్ కష్టాల నుంచి తమను తప్పించాలని ప్రజలు కోరుతున్నారు.

పీడీఎస్ బియ్యం ఎంఎల్ఎస్‌కు తరలింపు

కొత్తవలస: మండలంలోని నరపాం గ్రామంలో సత్యవరపు వెంకటబంగార్రాజు నివాసంలో పట్టుబడిన 6,227 కిలోల పీడీఎస్(ప్రజాపంపిణీ) బియ్యంను మండల కేంద్రంలోని ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించినట్లు సీఎస్‌డీటీ రమేష్ గురువారం తెలిపారు. సీఎస్‌డీటీ తెలిపిన వివరాలు.. నరపాం గ్రామానికి చెందిన సత్యవరపు వెంకటబంగార్రాజు సమీప గ్రామాల్లోని రేషన్ కార్డుదారుల నుంచి కోటా బియ్యం కొనుగోలు చేసి పెద్ద ఎత్తున నిల్వ చేసినట్లు వచ్చిన సమాచారం మేరకు ఎస్ఐ వీరజనార్దన్ ఆధ్వర్యంలో పోలీసులు బుధవారం రాత్రి సోదాలు చేశారు. సోదాల్లో 6,227 కిలోల బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బియ్యాన్ని ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించి, నిందితుడిపై 6-ఏ కేసు నమోదు చేశారు.

వైద్యసేవల్లో అలక్ష్యం వద్దు



వైద్య సిబ్బంది హాజరును పరిశీలిస్తున్న ఎంపీడీఓ వేదవతి

బొండపల్లి: రోగులకు వైద్య సేవలు అందించడంలో అలక్ష్యం ప్రదర్శించవద్దని ఎంపీడీఓ ఏ.వేదవతి పీహెచ్‌సీ వైద్య సిబ్బందికి సూచించారు. మండలంలోని దేవుపల్లి పీహెచ్‌సీలో గురువారం ఆమె తనిఖీలు నిర్వహించారు. రోగులకు అందిస్తున్న సేవలతో పాటు ,ఆస్పత్రిలో సౌకర్యాలు, మందుల నిల్వలు, వైద్య సిబ్బంది హాజరు రికార్డులను పరిశీలించారు. సిబ్బంది అంతా తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా విధులకు హాజరు కావాలని అన్నారు. రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలని, అలాగే గర్భిణులను ప్రసవాలకు ఇతర ఆస్పత్రులకు రిఫర్ చేయకుండా పీహెచ్‌సీలోనే ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని వైద్యాధికారి కె.పద్మావతికి సూచించారు.

వలంటీర్లకు నియామకపత్రాలు అందజేత



నియామకపత్రాలు అందజేస్తున్న ఎంపీడీఓ, నాయకులు

చీపురుపల్లి: మండలంలోని నిమ్మలవలస, ఇటకర్లపల్లి గ్రామాల్లో నూతనంగా నియమితులైన ఇద్దరు గ్రామ వలంటీర్లకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ మండల నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, శ్రీకాకుళం జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్‌మోహన్, ఎంపీడీఓ కె.రామకృష్ణరాజుతో కలిసి గురువారం నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన గ్రామవలంటీర్ వ్యవస్థ ద్వారా ఎంతో మంది యువతీ, యువకులకు ప్రజా సేవ చేసుకునే అవకాశం లభించిందని అన్నారు. పారదర్శకంగా విధులు నిర్వర్తిస్తూ ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని వలంటీర్లకు సూచించారు. నాయకులు చందక గురునాయుడు, రేవల్ల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సచివాలయాల్లో ఆధార్ సేవలు



గజపతినగరం: పురిటిపెంట సచివాలయం-1లో ఆధార్ సేవలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ కిశోర్‌కుమార్



దత్తిరాజేరు: దత్తిరాజేరులో ఆధార్ సేవలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం

గజపతినగరం: ఆధార్ సంబంధిత సేవలన్నీ గ్రామ సచివాలయాల్లోనే అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని ఎంపీడీఓ కె.కిశోర్ కుమార్ తెలిపారు. మండలంలోని పురిటిపెంట గ్రామ సచివాలయం-1లోని ఆధార్ కేంద్రంలో గురువారం ఆయన తనిఖీలు నిర్వహించారు. కేంద్రంలో ఇంత వరకు ఎన్నిఆధార్ సర్వీస్‌లు అందించారని డిజిటల్ అసిస్టెంట్ రొంగలి రమేష్‌ను ఎంపీడీఓ ఆరా తీయగా, సుమారు 100 సర్వీసులు అందించామని ఆయన చెప్పారు. ఆధార్ కార్డుల్లో తప్పులు, మార్పులు, చేర్పుల కోసం వచ్చిన వారి సమస్యలను పరిష్కరించాలని, సర్వీసులు పెంచి ప్రజలకు మరిన్ని సేవలు చేరువయ్యేలా చూడాలని సిబ్బందిని ఎంపీడీఓ ఆదేశించారు.

సద్వినియోగించుకోండి

దత్తిరాజేరు: స్థానిక గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రం సేవలను ప్రజలు సద్వినియోగించుకోవాలని ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం సూచించారు. స్థానిక సచివాలయంలోని ఆధార్‌సెంటర్‌లో గురువారం ఆయన తనిఖీలు నిర్వహించారు.కేంద్రంలో అందిస్తున్న సేవలపై సిబ్బందిని ఆయన ఆరా తీశారు. అనంతరం మాట్లాడు తూ ఆధార్ కార్డుల్లో పేర్లు, పుట్టిన తేదీలు ఇతర మార్పులు, చేర్పులను ఈ కేంద్రంలో చేసుకోవచ్చని, మండలంలోని ఎవరైనా ఈసేవలను వినియోగించుకోవచ్చని తెలిపారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు.

రూ.22 లక్షలతో డయేరియా వార్డు



కర్లాం పీహెచ్‌సీలో పూర్తయిన డయేరియా వార్డు భవన నిర్మాణం

చీపురుపల్లి: మండలంలోని కర్లాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ)లో రూ.22 లక్షలతో డయేరియా వార్డు నిర్మాణ పనులు పూర్తికావొచ్చాయి. పీహెచ్‌సీ వైద్యాధికారులు, గ్రామ ప్రజాప్రతినిధుల విజ్ఞప్తి మేరకు పీహెచ్‌సీలో డయేరియా వార్డు నిర్మాణానికి, రోగుల సంఖ్య ప్రకారం అవసరమైన అదనపు సౌకర్యాల కల్పనకు జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు రూ.22 లక్షల డీఎంఎఫ్ నిధులు మంజూరు చేయించారు. ఈ నిధులతో డయేరియా వార్డు భవన నిర్మాణ పనులు పూర్తి కావొచ్చాయి. ఈ వార్డులో దాదాపు 25 బెడ్లు వరకు ఏర్పాటు చేయనున్నారు. డయేరియా వ్యాధి ప్రబలిన అత్యవసర సమయాల్లో ఇక్కడ వైద్య సేవలు అందించేలా అన్ని సదుపాయాలు కల్పించనున్నారు. అలాగే పీహెచ్‌సీ సిబ్బంది సమావేశాలు, వీడియో కాన్ఫరెన్స్‌లు కూడా నిర్వహించుకునే విధంగా భవనాన్ని తీర్చిదిద్దనున్నారు. భవనాన్ని త్వరలో ప్రారంభించనున్నట్లు ఇంజినీరింగ్ అధికారులు చెబుతున్నారు.

మెనూ అమలుపై ఆనందం



ఎస్.కోట మండలం ధర్మవరం హైస్కూల్‌లో భోజనం చేస్తున్న విద్యార్థులు



వేపాడ మోడల్ స్కూల్‌లో కొత్తమెనూతో అందించిన భోజనాలను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ ఈశ్వరరావు

వేపాడ/ శృంగవరపుకోట: జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో కొత్త మెనూతో మధ్యాహ్న భోజనాలు అందిస్తుండడంతో విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సంక్రాంతి సెలవుల అనంతరం గురువారం పాఠశాలలు తెరుచుకున్నాయి. కొత్త మెనూ మేరకు నిమ్మకాయ పులిహోర, టమాటా పచ్చడి, ఉడికించిన కోడి గుడ్డు అందించారు. కొత్త మెనూ ప్రకారం సోమవారం హాట్ పొంగలి, కూరగాయల పలావు, గుడ్డు కూర, వేరుశనగ చిక్కీ, మంగళవారం చింతపండు పులిహోర, దొండకాయ పచ్చడి, బుధవారం కూరగాయల అన్నం, బంగాళ దుంప కుర్మా, ఉడికించిన కోడిగుడ్డు, వేరుశనగ చిక్కి, గురువారం సాంబార్ బాత్, లేదా నిమ్మకాయ పులిహోర, టమాటా పచ్చడి, ఉడికించిన గుడ్డు, శుక్రవారం ఆకుకూర పప్పు, ఉడికించిన గుడ్డు, వేరుశనగ చిక్కీ, శనివారం ఆకుకూరలతో అన్నం, పప్పుచారు, స్వీట్ పొంగలి అందించనున్నారు.

పూతదశలో యాజమాన్య పద్ధతులు తప్పనిసరి



అర్థన్నపాలెం సమీపంలోని మామాడితోటలను పరిశీలిస్తున్న ఉద్యానవన శాఖ అధికారులు

కొత్తవలస: మామిడి సాగులో పూత దశలో సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తేనే పూత నిలబడుతుందని, తద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా ఉద్యానవన సహాయ సంచాలకులు శైలజ అన్నారు. మండలంలోని బలిగట్టాం, అర్థన్నపాలెం, రాయపురాజుపేట, కంటకాపల్లి గ్రామాల్లోని మామిడి తోటలను స్థానిక ఉద్యానవన అధికా రి ఉమాభరణితో కలిసి గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సువర్ణరేఖ, పనుకులు వంటి రకాల చెట్లకు డిసెంబర్ నెలలో పూత వస్తుందని, అయితే అకాల వర్షాలు, తీవ్ర మంచు ప్రభావంతో వీటిలో పూత మాగిపోయిందన్నారు. ఆయా రకాలకు సంబంధించిన చెట్లలో పూత 40 శాతం మాత్రమే నిలిచిందని చెప్పారు అలాగే బంగినపల్లి రకం చెట్లకు ప్రస్తుతం పూత వస్తోందని, దీన్ని తేనె మంచు పురుగు, తామర పురుగు,బూడిద తెగులు ఎక్కువగా ఆశించే అవకాశం ఉందని, సకాలంలో నివారణ చర్యలు పాటించాలని రైతులకు వివరించారు. వారి వెంట గ్రామ ఉద్యానవన సహాయకులు ప్రసాద్, రవిప్రకాష్ తదితరులు ఉన్నారు.

ఘనంగా గ్రామదేవతల తీర్థమహోత్సవం



కొత్తవలస: చీపురవలసలో చెక్క గుర్రాల ఊరేగింపుతో మరిడిమాంబ గుడికి వెళుతున్న భక్తులు



వేపాడ: దబ్బిరాజుపేటలో ముత్యాలమ్మ ఆలయంవద్ద భక్తుల రద్దీ



వేపాడ: పూజలందుకుంటున్న ముత్యాలమ్మ



వేపాడ: దబ్బిరాజుపేటలో నిర్వహించిన పోటీల్లో ముగ్గు వేస్తున్న యువతి

వేపాడ: మండలంలోని దబ్బిరాజుపేటలో గ్రామదేవత ముత్యాలమ్మ తీర్థమహోత్సం గురువారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు. చుట్టుపక్క గ్రామాల వారు అమ్మవారిని దర్శించుకున్నారు. తీర్థం సందర్భంగా గ్రామపెద్దల ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు, గాలి పటాలు, బైక్, తదితర పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

వాలీబాల్ పోటీలు

కొత్తవలస: మండలంలోని దత్తి గ్రామంలో మరిడితల్లి అమ్మవారి తీర్థం సందర్భంగా జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలను గ్రామపెద్దల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ పోటీల్లో 18 జట్లు పాల్గొనగా..ఎల్.కోట మండలం వీరభద్రపేట గ్రామానికి చెందిన జట్టు విజేతగా నిలిచింది. ద్వితీయ, తృతీయ స్థానాల్లో జామి పెందుర్తి జట్లు నిలిచాయి. విజేతలకు రాష్ట్ర కొప్పుల వెలమకార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు చేతుల మీదుగా నిర్వాహకులు నగదు బహుమతులు అందజేశారు. పోటీలకు జాతీయ స్థాయి వాలీబాల్ రిఫరీ ఎల్.జి.ఎస్. కుమార్ వ్యవహరించారు. అంతకు ముందు గ్రామస్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే చీపురవలస గ్రామంలో మరిడిమాంబ అమ్మవారి తీర్థం నిర్వహించారు.ఈ సందర్భంగా చెక్క గుర్రాలను ప్రత్యేకంగా అలంకరించి గ్రామస్తులు భక్తి శ్రద్ధలతో ఊరేగించారు. అనంతరం అమ్మవారికి పూజలు చేశారు. సర్పంచ్ మచ్చ రామస్వామి, కొత్తవలస మేజర్ పంచాయతీ మెంబర్ లెంక సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.



కొత్తవలస: దత్తి గ్రామంలో వాలీబాల్ పోటీలు

అంగన్‌వాడీ కేంద్రాల్లో తనిఖీలు



అంగన్‌వాడీ కేంద్రంలో సిబ్బందితో మాట్లాడుతున్న అధికారి రామకృష్ణ, తదితరులు

గజపతినగరం: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలు- 3,4లలో జిల్లా సామాజిక పరివర్తన సమాచార వ్యవస్థ సమన్వయ అధికారి బి.రామకృష్ణ గురువారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి ఆదేశాల మేరకు అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు సర్కారు పాఠ శాలలు, గ్రామ సచివాలయాలను సందర్శించి వాటి పనితీరును పరిశీలిస్తున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు సక్రమంగా అందించాలని, కేంద్రాల్లో పరిశుభ్రత పాటించాలని సిబ్బందికి సూచించారు. రక్తహీనత నివారణకు తీసుకోవాల్సి న పౌష్టికాహారం, జాగ్రత్తలపై కౌమార బాలికలు, గర్భిణులకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం గజపతినగరం గ్రామ సచివాల యం-2లో తనిఖీలు చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు అనూరాధ, పార్వతి, సూర్యకుమారి, మహిళా సంరక్షణ కార్యదర్శులు కె.శ్రీలత, కె.రామరాజ్యం తదితరులు పాల్గొన్నారు.